## క్లుప్తంగా

### దేశభక్తి, దైవభక్తి రెండు కళ్లు



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై సోమవారం గురు వైభవంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి వూటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ఉపనిషన్మందిరం (శ్రీకాకుళం) కార్యనిర్వాహక అధ్యక్షులు నిష్ఠల నరసింహమూర్తి ప్రవచిస్తూ భారత దేశం ఋషిపీఠం, విశ్వ గురు పీఠం అని అన్నారు. దేశభక్తి, దైవభక్తి రెండు కన్నులని, వాటి ప్రాముఖ్యతను వివరించారు.

### వైభవంగా సాయి సచ్చరిత్ర పారాయణం



నగరంపాలెం: స్థానిక విద్యానగర్ మూడో వీధిలోని శ్రీసాయినాథ సన్నిధానంలో గురుపూర్ణిమ ఉత్సవ వేడుకలు కొనసాగుతున్నాయి. సోమవారం సాయినాథునికి విశేష అభిషేకాలు, అర్చనలు జరిగాయి. అనంతరం సాయి సచ్చరిత్ర పారాయణం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై, స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షులు యడ్లపాటి అశోక్ కుమార్, అధ్యక్షులు వడ్లమూడి శివరామకృష్ణయ్య పాల్గొన్నారు.

### ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

లక్ష్మీపురం: ఆటోడ్రైవర్‌లను ఆదుకోవాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నపనేని శివాజీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మణ్ రావు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే ఆటో డ్రైవర్లకు ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 21 సవరణ చేసి పెంచిన అన్ని రకాల ఫీజులు, పెనాల్టీలు తగ్గించాలని కోరారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాహన ఫిట్నెస్ ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వడం ఏటీఎస్ ఆటోమేటిక్ ట్రాకులు విధానం రద్దు చేయాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ప్రతి డ్రైవర్‌కు వాహన మిత్ర పథకం వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు షేక్ మస్తాన్ వలి, నగర కార్యదర్శి జి.శంకర్, షేక్ ఇస్మాయిల్, కె.కొండలు పాల్గొన్నారు.

### సుందరయ్య నగర్ వాసులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



లక్ష్మీపురం: 18 సంవత్సరాలుగా నివాస ఉంటున్న గుంటూరు నగరం 41వ డివిజన్ పుచ్చలపల్లి సుందరయ్య నగర్ వాసులకు ఇళ్ల పట్టాలి ఇవ్వాలని సుందరయ్య నగర అభివృద్ధి కమిటీ, సీపీఎం స్థానిక శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి సోమవారం అర్జీ అందజేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి 5500 ఇళ్ల పట్టాలి ఇచ్చేదానిలో సుందరయ్య నగర్‌కు సంబంధించిన ఇళ్లకు కూడా పట్టాలిస్తామని హామీ ఇచ్చినట్లు కమిటీ అధ్యక్షుడు ఆది నికల్సన్ తెలిపారు. కలెక్టర్‌కు విన్నవించిన వారిలో సీపీఎం శాఖా కార్యదర్శి గోనే లూథరపాల్, నాయకులు షేక్ మస్తాన్ వలి, బి.లక్ష్మణరావు, సాగర్, నాగరాజు, మురళి, యోహాను, విజయలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి




వన మహోత్సవ ర్యాలీ ప్రారంభిస్తున్న విష్ణువర్ధన్

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలోని ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ పేర్కొన్నారు. సోమవారం లక్ష్మీపురంలోని సీతారామయ్య పాఠశాలలో వారం రోజుల నుంచి నిర్వహిస్తున్న వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల నుంచి లక్ష్మీపురంలోని మదర్ థెరిస్సా విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లిన విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ చాటుతూ ప్లకార్డులు చేత్తో పట్టుకుని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ డి.దుర్గాశ్యామ్, ప్రైమరీ కో–ఆర్డినేటర్ దిల్ జహాన్ పాల్గొన్నారు.

# దారుణ మోసం

- ఎస్సీ, బీసీలకు సబ్సిడీ రుణాలంటూ ఆర్భాటాలు
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ పూర్తి
- ఇంత వరకు రుణాల మంజూరుపై స్పష్టత రాని వైనం
- లోన్ల కోసం ఆశగా ఎదురు చూస్తున్న నిరుద్యోగ యువత




గుంటూరు నగరంలో బీసీ లోన్లకు సంబంధించి క్రెడిట్ క్యాంపులు నిర్వహిస్తున్న నగరపాలక సంస్థ అధికారులు(ఫైల్)

నెహ్రూనగర్: కూటమి అన్ని వర్గాలను ఏమారుస్తోంది. సంక్షేమం పేరుతో హామీలు గుప్పించింది. అధికారం వచ్చిన తరువాత ఊసే ఎత్తడం లేదు. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, కాపు తదితర పేద వర్గాలకు సబ్సిడీ రుణాలు ఇవ్వకుండా పంగనామాలు పెట్టేందుకు సిద్ధమైంది. దరఖాస్తు చేసుకోండి అని ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన ప్రజలను నమ్మించి మాట మార్చింది. ఎస్సీ రుణాలకు యూనిట్లు మారుస్తున్నామని, తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు రుణాలకు సంబంధించిన ప్రక్రియను నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసింది. బీసీ రుణాలకు సంబంధించి కూడా ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరపరాదని ఉత్తర్వులు ఇచ్చింది.

**ఆశలకు మూత వేసి**

జిల్లా షెడ్యూల్డు కులాల ఆర్థిక సహకార సంస్థ ఆధ్వర్యంలో 2025–26లో గుంటూరు జిల్లాకు రూ.990 యూనిట్లు కింద రూ.41.33 కోట్లు, పల్నాడు జిల్లాకు రూ.992 యూనిట్లు కింద రూ.38.56 కోట్లు మేర సబ్సిడీ రుణాలను అందిస్తున్నట్లు ఏప్రిల్ మొదటి వారంలో ప్రకటించారు. రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు(40 నుంచి 60శాతం వరకు సబ్సిడీ) రుణాలు అందిస్తున్నట్లు డబ్బాకొట్టారు. ఈ నేపథ్యంలో వేల సంఖ్యలో నిరుద్యోగులు తమకు అనుభవం ఉన్న రంగాల్లో యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ఇంకా దరఖాస్తు చేసుకునేందుకు సమయం ఉన్నా యూనిట్లను మారుస్తున్నామంటూ దరఖాస్తు చేసుకునే సైట్‌ను ప్రభుత్వం మూత వేసింది.

**నిరాశే మిగిలింది...**

అన్ని కార్పొరేషన్ల కంటే ముందుగా బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందిస్తున్నట్లు ప్రచారాన్ని హోరెత్తించారు. అదే స్థాయిలో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రచారాలను కూడా ముమ్మరం చేశారు. జిల్లాలోని బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన వారు వేలల్లో దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మండలాలు, మున్సిపాలిటీల వారీగా ఎంపికలు(క్రెడిట్ క్యాంపులు) జరిగాయి. తీరా రుణాలు అందుతాయనే సమయంలో సైట్ క్లోజ్ చేసి రుణాలకు సంబంధించిన ప్రక్రియను నిలుపుదల చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. మండలాలు, మున్సిపాలిటీల నుంచి కూడా ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుకోరాదని తేల్చేశారు. దీంతో బీసీ రుణాల కోసం ఆశించిన పేద వర్గాలకు నిరాశే మిగిలుతోంది.

### బీసీ లోన్లు మంజూరు చేయాలి



గతంలో బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ లోన్ల కోసం దరఖాస్తులు స్వీకరించారు.. కాని ఇంత వరకు వాటి ఊసే లేకపోవడంతో చాలా మంది నిరుద్యోగ యువత ఇబ్బందులు పడుతున్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరికి లోన్లు మంజూరు చేయడంతో పాటు కొత్త లోన్లు కూడా మంజూరు చేయాలి.

– లింగాల వెంకటసాయి యాదవ్, మహాత్మపూలే సేవా సంఘం అధ్యక్షులు

### ప్రచార ఆర్భాటమే



కూటమి ప్రభుత్వం కేవలం ప్రచార ఆర్భాటంతోనే కాలం వెళ్లదీస్తోంది. కార్మికులు, నిరుద్యోగులు, రైతులు ఇలా అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తుంది. రుణాల పేరుతో ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ నిరుద్యోగుల ఆశలపై నీళ్లు పోసేందుకు సిద్ధమైంది. ప్రభుత్వం ప్రకటించిన విధంగా జిల్లాలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ సబ్సిడీ రుణాలను అందించాలి.

– పరిశపోగు శ్రీనివాసరావుమాదిగ, నవ్యాంధ్ర ఎమ్మార్పీస్ అధ్యక్షులు

## పేదల పెన్నిధి డాక్టర్ వైఎస్సార్

**డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి**



గుంటూరు ఎడ్యుకేషన్: పేదల సంక్షేమం కోసం శ్రమించిన మహా మనిషి, పేదల పెన్నిధి డాక్టర్ వైఎస్సార్ చిరస్మరణీయుడని రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ పూర్వ అధ్యక్షురాలు డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి అన్నారు. గుంటూరులోని అవర్ స్టేట్ అవర్ లీడర్ ఇండియన్ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు జి.శాంతమూర్తి ఆధ్వర్యంలో మహానేత డాక్టర్ వైఎస్సార్ జయంతి వారోత్సవాల్లో భాగంగా సోమవారం 'గొప్ప జ్ఞాపకాలు శీర్షికన 'పేదల పెన్నిధి వైఎస్సార్ 'అనే అంశంపై ప్రముఖ కవి కాపిరెడ్డి కృష్ణారెడ్డి మోడరేటర్‌గా వెబినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మీపార్వతి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పేద ప్రజల అభ్యున్నతికై నిరంతరం కృషి చేసిన అపర భగీరథుడు రాజశేఖర రెడ్డి అని తెలిపారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట వేసిన మహానేత రెండు రూపాయలకే కిలో బియ్యం పథకాన్ని పున:ప్రారంభించారని గుర్తు చేశారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ, 108 అంబులెన్స్ సేవలతో పాటు పేదలకు ఉచిత వైద్యం వంటి ఆదర్శవంతమైన కార్యక్రమాలు ప్రారంభించారని చెప్పారు. జలయజ్ఞం ద్వారా కోటి ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో భారీ నీటి ప్రాజెక్టుల నిర్మాణాలను చేపట్టారని వివరించారు. సున్నా వడ్డీ రుణాలు, ఉచిత విద్యుత్, పంటల బీమా వంటి పథకాలను చేపట్టి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల ఉన్నత చదువులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించారని చెప్పారు. ప్రజల హృదయాల్లో కలకాలం జీవించే నాయకుడిగా గుర్తింపు పొందిన వైఎస్సార్ జయంతిని యేటా రైతు దినోత్సవంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నారని వివరించారు. వెబినార్‌లో వెంకటరెడ్డి(జర్మనీ), విష్ణు(బెంగళూరు), రత్నరాజు(రాజమండ్రి), త్రినాథ్‌రాజు(అమలాపురం), మల్లికార్జున రెడ్డి(పిడుగురాళ్ల), డాక్టర్ పుష్ప(విశాఖపట్నం), టీఆర్ రమేష్, డాక్టర్ లెనిన్, పోతురాజు దుర్గాదేవి (గుంటూరు) పాల్గొన్నారు.

## నిర్దేశిత గడువులోగా అర్జీలు పరిష్కరించాలి

**కమిషనర్ పులి శ్రీనివాసులు**



ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరిస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టిన డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు అందించే అర్జీలు, ఇతర సేవలు నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేయాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు విభాగాధిపతులకు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి 30 అర్జీలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందే అర్జీల్లో తక్షణం పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేర్వేరుగా లిస్టు తయారు చేయాలని సూచించారు. డయల్ యువర్ కమిషనర్‌కు అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలని కోరారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పీజీఆర్ఎస్ ద్వారా పట్టణ ప్రణాళిక విభాగానికి 9, ఇంజినీరింగ్ విభాగానికి 17, రెవెన్యూ విభాగానికి 6, ప్రజారోగ్య విభాగానికి 3, ఉపా సెల్ విభాగానికి 2, అకౌంట్స్ విభాగానికి 2 చొప్పున మొత్తం 39 ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం పాల్గొన్నారు.

**నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ జరగాలి**

నెహ్రూ నగర్: నగరపాలక సంస్థ పరిధిలో నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ చేయడం ద్వారా రోడ్లు, కాలువల్లో వ్యర్థాలు లేకుండా చూడవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. సోమవారం సంగడిగుంట, లాంచెస్టర్ రోడ్, ఐపీడీ కాలనీ, గొలుసు కొండలరావు నగర తదితర ప్రాంతాల్లో పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ వార్డు సచివాలయాల వారీగా మైక్రో ప్యాకెట్స్ ప్రాతిపదికన ప్రజారోగ్య కార్మికులు ఇంటింటి చెత్త సేకరణ చేయాలన్నారు. కార్యదర్శులు విధిగా ఉదయం మస్టర్ సమయానికి హాజరై కార్మికుల పనిని క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్ అబీద్, ఎస్ఎస్ ఆయాబ్ ఖాన్ పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



విద్యార్థినికి నగదు ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న ఎస్పీ నగేష్‌బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏపీ ఈగిల్ వింగ్ ఎస్పీ నగేష్‌బాబు పేర్కొన్నారు. సోమవారం ఏటీ అగ్రహారంలోని ఎస్‌కేబీఎం నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సంఘ ఆధ్వర్యంలో ప్రతిభ గల విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పాఠశాల పూర్వ విద్యార్థి నగేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని విద్య నేర్పిన గురువులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. చాక్లెట్ల రూపంలో మత్తు పదార్థాలను తయారు చేస్తున్నారని, ఇటువంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. చదువుతోపాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలని కోరారు. పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధి బీఎల్ శైలజ మాట్లాడుతూ పేద విద్యార్థులను చదువులో ప్రోత్సహించేందుకు పూర్వ విద్యార్థుల సంఘ ఆధ్వర్యంలో ప్రతి యేటా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆరో తరగతి నుంచి టెన్త్ వరకు పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.రెండు లక్షలు నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేశారు. అదే విధంగా పూర్వ విద్యార్థి చేబ్రోలు శ్రీనివాసరావు పాఠశాలకు కంప్యూటర్ అందజేశారు. పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మోహనరావు, కార్పొరేటర్ అడకా పద్మావతి, పాఠశాల హెచ్ఎం ఖాజావలి, పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధులు కె. కోటేశ్వరరావు, శీలం శ్రీనివాసరావు, ఆళ్ల వీరభద్రరావు, మధులాల్, హైమారావు, సీహెచ్ శ్రీను పాల్గొన్నారు.

### దిగజారుతున్న గురుశిష్యుల బంధం




గుంటూరు ఎడ్యుకేషన్: ఆధునిక కాలంలో గురుశిష్యుల మధ్య సంబంధాలు దిగ జారుతున్నాయని తెలుగు అకాడమీ విశ్రాంత డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ సుశీలమ్మ అన్నారు. జేకేసీ కళాశాలలో భారతీయ భాషా విభాగాల ఆధ్వర్యంలో సోమవారం ''గురుశిష్య సంబంధాలు– మానవీయ విలువలు'' అనే అంశంపై ఆమె అతిథి ఉపన్యాసమిచ్చారు. సకల విశ్వమే మహాగురువని, తరతరానికి గురుశిష్యుల మధ్య సంబంధాలు మారుతున్నాయని అన్నారు. 60 ఏళ్ల క్రితం ఉన్న గురువుల బోధన, స్వీకరించే శిష్యుల మనోస్థితిలో ప్రస్తుత ఎంతో తేడా ఉందన్నారు. ప్రస్తుత యువతరంలో నేను, నాది అనే స్వార్థ పెరిగిపోతోందని, మానవతా విలువలు దిగజారిపోయి, ప్రపంచమంతటా అమానవీయ విలువలు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సమాజం, కుటుంబం, గురువుల పట్ల బాధ్యతను గుర్తు చేసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని అన్నారు. కార్యక్రమంలో కళాశాల పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సాంబశివరావు, భారతీయ భాషా విభాగాధిపతి డాక్టర్ వై. ప్రశాంతి, ఆంగ్ల శాఖాధ్యక్షురాలు పి.నాగసుశీల పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెకు రైతు సంఘాల మద్దతు




సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘాల నేతలు

లక్ష్మీపురం: వ్యవసాయ రంగాన్ని, కార్మిక హక్కులను కార్పొరేట్ శక్తుల చేతిలో వదిలేసే విధానాలను తిప్పికొట్టాలని జిల్లా రైతు సంఘాల నేతలు స్పష్టం చేశారు. గుంటూరు కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో సోమవారం రైతు సంఘాల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కంచుమాటి అజయ్ కుమార్ మాట్లాడుతూ, 'రైతాంగాన్ని అట్టడుగున పడేస్తున్న విధానాలపై మౌనంగా ఉండే పరిస్థితి లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరల చట్టాన్ని కూడా అమలు చేయకుండా, కొత్త నష్టకర విధానాలను తీసుకొస్తోందని మండి పడ్డారు. ఐక్యంగా పోరాడితేనే రైతు బతుకు నిలబడుతుందన్నారు. మన్నవ హరిప్రసాద్ మాట్లాడుతూ జూన్ 9న జరగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో, మండలాల్లో మే 30న నిరసనలు, సభలు నిర్వహించాలన్నారు.. రైతుల సమస్యలు, కార్మికుల హక్కులు ఒకే పోరాటమనాన్రు. సమావేశంలో పీవీ జగన్నాథం, కంజుల విఠల్ రెడ్డి, ముసలయ్య, ఈమని అప్పారావు, బి.రామకృష్ణ, కోటయ్య, రవి పాల్గొన్నారు.

### ప్రయోజనం లేని బనకచర్ల!

లక్ష్మీపురం: పోలవరం ప్రాజెక్టు ఇంకా పూర్తి కాకపోతే, కొత్తగా ప్రయోజనం లేని ప్రాజెక్టులను ప్రవేశపెట్టడం రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసే చర్యగా మారుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్ అన్నారు. సోమవారం గుంటూరులో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడిగా ఉన్న పోలవరం ప్రాజెక్టు పూర్తి కాకముందే బనకచర్ల ప్రాజెక్టు గురించి చర్చ మొదలుపెట్టడం అసంబద్ధంగా ఉందని విమర్శించారు. ప్రజల అవసరాలను, సాగునీటి సమస్యలను విస్మరించి ఇలా వ్యవహరించడం బాధాకరమని చెప్పారు.

## అందరి భాగస్వామ్యంతో 'సుందర నగరం'



సమావేశంలో మాట్లాడుతున్న నగర మేయర్ రవీంద్ర, కమిషనర్ శ్రీనివాసులు

నెహ్రూ నగర్: గుంటూరు నగరాన్ని సుందర, పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దుకోవడంలో ప్రజా ప్రతినిధులు, అధికారులతో పాటు స్వచ్ఛంద సంస్థలు, స్టేక్ హోల్డర్స్‌ని భాగస్వాములను చేస్తామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో మిషన్ గ్రీన్, వెండింగ్ జోన్ల ఏర్పాటుపై స్టేక్ హోల్డర్స్, వెండింగ్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రానున్న కాలంలో గుంటూరు నగరాన్ని పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దుకోవాడానికి నగరంలో విస్తృతంగా మొక్కలు నాటే ప్రక్రియ చేపట్టామన్నారు. వార్డుల వారీగా కార్పొరేటర్లు ద్వారా మొక్కల పంపిణీ చేయడం జరిగిందన్నారు. సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఏడీహెచ్ జె.శాంతి, ఎంహెచ్ఓ(ఇన్ చార్జి) రామారావు పాల్గొన్నారు.

## గర్భిణులకు వచ్చే వ్యాధులపై వైద్యులకు శిక్షణ



అవగాహన పత్రాలు ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్ఓ విజయలక్ష్మి, డాక్టర్ శ్రావణ్‌బాబు

గుంటూరు మెడికల్: గర్భిణులకు వచ్చే ప్రమాదకర లక్షణాలపై జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులకు శిక్షణ కార్యక్రమం సోమవారం గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి హాజరై మాట్లాడారు. గర్భిణులలో వచ్చే 19 రకాల ప్రమాదకర లక్షణాలపై రెండు రోజుల శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. మెడికల్ ఆఫీసర్‌లు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని గర్భిణుల వ్యాధులపై అవగాహన పెంచుకుని సత్వర చికిత్సలు అందించి ప్రమాదకర వ్యాధుల నుంచి రక్షించాలన్నారు. డాక్టర్ శిరీష, డాక్టర్ శ్రీవల్లి.. గర్భిణులకు వచ్చే ప్రమాదకర లక్షణాలు, అందించాల్సిన చికిత్స, నిర్వహణ, ట్రాకింగ్ గురించి వివరించారు. గర్భిణుల్లో వచ్చే ప్రమాదకర లక్షణాలపై అవగాహన పత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, ఆర్మన్ సంస్థ ప్రతినిధి వెంకట్, డెప్యూటీ డి.ఎం.హెచ్.ఒ. డాక్టర్ ఈ.అన్నపూర్ణ, డాక్టర్ ప్రియాంక, శ్రీధర్ రెడ్డి, పాల్గొన్నారు.

## 'శ్రీ పూజిత'కు బెస్ట్ స్కూల్ విత్ హోలిస్టిక్ ఎడ్యుకేషన్ అవార్డు



మేరీలాండ్ వర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్న హరికృష్ణ ప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌లో నిర్వహించిన వరల్డ్ స్కూల్ సమ్మిట్–2025లో పట్టాభిపురంలోని శ్రీపూజిత పాఠశాల బెస్ట్ స్కూల్ విత్ హోలిస్టిక్ ఎడ్యుకేషన్ అవార్డును సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కంచర్ల పద్మావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5వ తేదీన థాయిలాండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల యంగ్ డైరెక్టర్ కంచర్ల హరికృష్ణ ప్రసాద్ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. అంతర్జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మకమైన గుర్తింపు విద్యార్థులకు ప్రేరణ కలిగించడంలోనూ, పాఠశాల విద్య, సమగ్ర విజయానికి నమూనాగా మార్చడంలో అంకితభావానికి నిదర్శనమని తెలిపారు. అదే విధంగా మేరీలాండ్ స్టేట్ యూనివర్శిటీ– అమెరికా నుంచి బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో కంచర్ల హరికృష్ణప్రసాద్ డాక్టరేట్ పట్టా అందుకున్నట్లు పేర్కొన్నారు. అరుదైన ఘనత సాధించి, స్వదేశానికి తిరిగి వచ్చిన పాఠశాల డైరెక్టర్ కంచర్ల హరికృష్ణ ప్రసాద్‌కు పాఠశాల యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

## ఇష్టపడి చదివితే ఉన్నత భవిష్యత్



విద్యార్థి నాయకులతో కొండలరావు, చంద్రశేఖర్ రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: కష్టంతో ఇష్టపడి చదవడం ద్వారా ఉన్నతస్థాయికి చేరుకోగలరని దూరదర్శన్, ఆకాశవాణి పూర్వ వార్తా విభాగాధిపతి డాక్టర్ గుత్తికొండ కొండలరావు అన్నారు. సోమవారం ఎన్జీవో కాలనీలోని సమేధ హైస్కూల్లో విద్యార్థి నాయకత్వ లక్షణాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కొండలరావు మాట్లాడుతూ సామాన్యులుగా జన్మించి అసామాన్యులుగా ఎదిగిన మహాత్మాగాంధీ, అబ్దుల్‌కలాం బాటలో జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. జీఎస్టీ సహాయ కమిషనర్ కె.కేదారేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ రంగాలకు చెందిన వారి విజయగాథలను వివరించారు. పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు విద్యార్థుల నుంచి నాయకులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థి నాయకులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె. రాంబాబు, ఆనం సంజీవ రెడ్డి, ధర్మపీఠం నిర్వాహకుడు ఎస్.చంద్రశేఖర్, ఎస్.సంతోష్, అధ్యక్షుడు శశికిరణ్, ఉపాధ్యక్షుడు ప్రహర్షిత, సహాయ కార్యదర్శి యర్రంశెట్టి శ్రీనివాస్, ఏవీకే సుజాత పాల్గొన్నారు.

### 13న ఏ షామ్ మస్తాని సినీ సంగీత విభావరి

నగరంపాలెం: ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్, గీతాంజలి ఆర్కెస్ట్రా సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 13న ఏ షామ్ మస్తాని సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ కార్యదర్శి పి.రామచంద్రరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ కూడలిలోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సాయంత్రం ప్రారంభమవుతుందని అన్నారు. గత 16 ఏళ్లుగా గీతాంజలి ఆర్కెస్ట్రా నిర్వాహకుడు అమ్మపండు సహకారంతో ప్రసిద్ధ గాయనీ, గాయకులతో పాత హిందీ చలన చిత్రాల గీతాల విభావరి నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఉచిత పాస్‌లకై మొబైల్ నంబర్ 9848365751 లేదా శ్రీవెంకటేశ్వర విజ్ఞామందిరంలో, బ్రాడీపేట గీతాంజలి ఆర్కెస్ట్రా కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

### అంగన్‌వాడీ సిబ్బందికి జీతాలు పెంచాలి



వేణుగోపాలరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నెహ్రూనగర్: అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలని కోరుతూ ఏపీ అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి.రాధ విన్నవించారు. గుంటూరులోని మహిళ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వేణుగోపాల రెడ్డిని కలిసి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు.